### రెండో సారి ఫ్రెంచ్ ఓపెన్ కైవసం

# కింగ్ అల్కరాజ్

### హోరాహోరీ ఫైనల్లో సిన్నర్‌పై విజయం

**టెన్నిస్‌లో అద్భుతం చోటు చేసుకుంది! సుదీర్ఘ క్రీడా చరిత్రలో మరుపురాని పోరుగా కార్లోస్ అల్కరాజ్, జానిక్ సిన్నర్ మధ్య ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్ పోరు నిలిచిపోయింది. ఐదున్నర గంటల పాటు నువ్వానేనా అన్నట్లు సాగిన మెగాఫైట్‌లో ఆఖరికి అల్కరాజ్‌కే ఫ్రెంచ్ కిరీటం దక్కింది. వరల్డ్ నంబర్‌వన్ సిన్నర్‌తో ఢీ అంటే ఢీ అన్నట్లు సాగిన పోరులో అల్కరాజ్ అద్భుత విజయం సాధించాడు. ఆఖరి వరకు గెలుపు దోబూచులాడిన పోరులో సిన్నర్‌పై అల్కరాజ్ జయకేతనం ఎగురవేశాడు. ప్రత్యర్థికి తొలి రెండు సెట్లు కోల్పోయినా ఆత్మవిశ్వాసం కోల్పోని స్పెయిన్ బుల్ అసమాన పోరాటపటిమతో వరుసగా రెండోసారి ఫ్రెంచ్ టైటిల్‌ను సగర్వంగా ముద్దాడాడు. స్పెయిన్ దిగ్గజం రఫెల్ నాదల్‌కు తానే సరైన వారసుడనని చేతల్లో చూపెట్టిన వైనం నభూతో నభవిష్యత్. తుదికంటా తొలి ఫ్రెంచ్ టైటిల్ కోసం పోరాడిన సిన్నర్ రన్నరప్‌తో సరిపెట్టుకున్నాడు.**







పారిస్: ప్రతిష్టాత్మక ఫ్రెంచ్ ఓపెన్‌లో కార్లోస్ అల్కరాజ్ శకం నడుస్తున్నది. దిగ్గజ రఫెల్ నాదల్‌కు వారసునిగా మన్ననలు అందుకుంటున్న అల్కరాజ్ అదే బాటలో మరో ముందడుగు వేశాడు. ఆదివారం ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన ఫైనల్ పోరులో డిఫెండింగ్ చాంపియన్ అల్కరాజ్ 4-6, 6-7(7-4), 6-4, 7-6(7-3), 7-6(10-2) తేడాతో వరల్డ్ నంబర్‌వన్ జానిక్ సిన్నర్(ఇటలీ)పై చిరస్మరణీయ విజయం సాధించాడు. సరిగ్గా 5 గంటల 29 నిమిషాల పాటు సాగిన ఈ మారథాన్ పోరులో అల్కరాజ్‌నే అదృష్టం వరించింది. తొలి రెండు సెట్లను సిన్నర్‌కు చేజార్చుకున్న అల్కరాజ్ పుంజుకుని వరుసగా మూడు సెట్లలో మ్యాచ్‌ను కైవసం చేసుకున్నాడు. సిన్నర్ తప్పిదాలను తనకు అనుకూలంగా మలుచుకుంటూ అల్కరాజ్ పోరాడిన తీరు అద్భుతమని చెప్పాలి. మ్యాచ్ చేజారిందనుకున్న ప్రతీసారి తనలో పోరాట యోధుడిని తట్టిలేపిన ఈ స్పెయిన్ నయాబుల్ వరుసగా రెండో ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌తో కొత్త చరిత్ర లిఖించాడు. ఈ క్రమంలో 22 ఏండ్ల వయసులోనే ఐదో గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను అల్కరాజ్ తన ఖాతాలో వేసుకున్నాడు.

**ఆది నుంచే హోరాహోరీ:**

సిన్నర్, అల్కరాజ్ మధ్య తొలి సెట్ మొదటి గేమ్‌కు 12నిమిషాల సమయం పట్టింది. ఇక్కణ్నే ఈ ఇద్దరు ప్లేయర్ల మధ్య పోరు ఎలా గుంటుందో అభిమానులకు అర్థమయ్యింది. మరో ఎండ్‌లో తానేం తక్కువ కాదని నిరూపించుకునే క్రమంలో అల్కరాజ్ బ్రేక్ పాయింట్‌ను కాపాడుకుంటూ గేమ్‌ను దక్కించుకోవడంతో 1-1తో సమమైంది. బ్యాక్‌హ్యాండ్ షాట్లకు తోడు పవర్‌ఫుల్ సర్వ్‌లతో చెలరేగిన సిన్నర్ తొలి సెట్‌ను 6-4తో దక్కించుకుని శుభారంభం చేశాడు. అదే ఊపును కొనసాగిస్తూ రెండో సెట్‌లోకి ప్రవేశించిన సిన్నర్‌కు అల్కరాజ్ బ్రేక్ వేసే ప్రయత్నం చేశాడు. మొదట్లో వరుస గేమ్‌లు కైవసం చేసుకున్న సిన్నర్‌కు అద్భుతంగా పుంజుకున్న అల్కరాజ్ పోటీలోకి వచ్చాడు. దీంతో అలవోకగా సెట్‌ను కైవసం చేసుకుందామనుకున్న సిన్నర్‌ను టైబ్రేక్‌కు తీసుకెళ్లాడు. అయితే ఇక్కడ అదృష్టం సిన్నర్‌కే సొంతమైంది. 7-4తో రెండో సెట్‌ను దక్కించుకున్నాడు. మరో సెట్ గెలిస్తే కెరీర్‌లో తొలిసారి ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ సిన్నర్ సొంతమవుతుంది. కానీ కీలకమైన మూడో సెట్‌లో స్పెయిన్ సంచలనం ఎక్కడా తల వంచకుండా సిన్నర్‌కు దీటైన పోటీనిచ్చాడు. అప్పటి వరకు వరుస సెట్లు గెలిచి ఆత్మవిశ్వాసంతో కనిపించిన సిన్నర్‌కు అల్కరాజ్‌కు ఊహించని ప్రతిఘటన ఎదురైంది. గేమ్‌కు గేమ్‌కు తన ఆటకు మరింత మెరుగులు అద్దుకున్న డిఫెండింగ్ చాంపియన్ 6-4తో మూడో సెట్‌ను గెలిచి పోటీని మరింత రసవత్తరంగా మార్చాడు. కనీసం నాలుగో సెట్‌లోనైనా గెలిచి మ్యాచ్‌ను దక్కించుకుందామనుకున్న సిన్నర్ ఆశలు నెరవేరలేదు. ఒకానొక దశలో 5-3తో మ్యాచ్ పాయింట్‌కు వచ్చిన వరల్డ్ నంబర్‌వన్‌కు అల్కరాజ్ అద్భుతమైన పోటీనిచ్చాడు. అభిమానుల అశేష మద్దతును తనకు అనుకూలంగా మలుచుకుంటూ చేజారుతుందనుకున్న మ్యాచ్‌ను అల్కరాజ్ తన వైపునకు తిప్పుకున్నాడు. ఇద్దరి మధ్య హోరాహోరీతో సెట్ కాస్తా టైబ్రేక్‌కు దారితీసింది. ఇక్కడ సిన్నర్ 2-0 ఆధిక్యం ప్రదర్శించినా అనవసర తప్పిదాలతో అల్కరాజ్‌కు మూల్యం చెల్లించుకున్నాడు. 5-2తో ఆధిక్యం కనబరిచిన అల్కరాజ్ 7-3తో సెట్‌ను దక్కించుకోవడంతో మ్యాచ్ కాస్తా 2-2తో సమమై నిర్ణయాత్మక ఐదో సెట్‌కు దారితీసింది. ఇందులోనూ అల్కరాజ్, సిన్నర్ పోరాటం అభిమానులను మునివేళ్లపై నిలబెట్టింది. ఆధిక్యం తరుచూ చేతులు మారిన పోరులో వెనుకంజ వేసిన ప్రతీసారి అల్కరాజ్ పుంజుకున్న తీరు అభిమానులను కట్టిపడేసింది. గెలిచే అవకాశాన్ని చేజేతులా విడిచిపెట్టుకున్న సిన్నర్..టైబ్రేక్‌లో మ్యాచ్‌ను కోల్పోవాల్సి వచ్చింది.

**ప్రైజ్‌మనీ:**

అల్కరాజ్ – రూ. 24.92 కోట్లు
సిన్నర్ – రూ. 12.46 కోట్లు

**మ్యాచ్ సాగిందిలా..**

| సిన్నర్ | | అల్కరాజ్ |
|---|---|---|
| 8 | ఏసెస్ | 7 |
| 0 | డబుల్ ఫాల్ట్స్ | 7 |
| 7/15 | బ్రేక్ పాయింట్స్ | 7/14 |
| 1 | టైబ్రేక్స్ గెలుపు | 2 |
| 53 | విన్నర్స్ | 70 |
| 64 | అనవసరపు తప్పిదాలు | 73 |



## భారత్‌కు ఆరు స్వర్ణాలు

తైపీ సిటీ: తైవాన్ ఓపెన్ ఇంటర్నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత అథ్లెట్ల పసిడి పతక ధమాకా దిగ్విజయంగా కొనసాగుతున్నది. ఆదివారం జరిగిన వేర్వేరు పోటీల్లో భారత అథ్లెట్లు ఏకంగా ఆరు స్వర్ణ పతకాలతో సత్తాచాటారు. మహిళల 800మీటర్ల ఫైనల్‌తో పాటు లాంగ్ జంప్‌లో మన అథ్లెటు అదరగొట్టారు. పురుషుల 4X400మీటర్ల ఈవెవట్‌లో సంతోష్, విశాల్, ధరమ్‌వీర్ చౌదరీ, మనుతో కూడిన భారత బృందం 3:05:58సెకన్ల టైమింగ్‌తో స్వర్ణం సొంతం చేసుకుంది. మహిళల 400మీటర్ల హర్డిల్స్ ఫైనల్లో విత్య రామ్‌రాజ్ 56.53సెకన్లతో స్వర్ణాన్ని ముద్దాడింది.

## యువభారత్ శుభారంభం

అంట్వెర్ప్(బెల్జియం): యూరప్ పర్యటనలో భారత జూనియర్ మహిళల జట్టు శుభారంభం చేసింది. ఆదివారం జరిన తమ తొలి మ్యాచ్‌లో యువ భారత్ 3-2 తేడాతో బెల్జియంపై అద్భుత విజయం సాధించింది. ఆఖరి వరకు హోరాహోరీగా సాగిన పోరులో భారత్ తరపున గీతాయాదవ్(11ని), సోనమ్(40ని), లాల్‌తాన్లుగి(45ని) గోల్స్ చేశారు. మ్యారీ గోన్స్(25ని), లూయిస్ వాన్ హెక్(34ని).. బెల్జియంకు గోల్స్ అందించారు.

## స్వప్నిల్, ఎలావెనిల్ సారథ్యంలో..

లమ్యూనిచ్: మ్యూనిచ్ వేదికగా మొదలుకానున్న ఐఎస్‌ఎస్‌ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్ కోసం భారత జట్టును ఆదివారం ఎంపిక చేశారు. మంగళవారం మొదలయ్యే టోర్నీలో పారిస్ ఒలింపిక్స్ కాంస్య విజేత స్వప్నిల్ కుశాలె, ఎలావెనిల్ వాలరివన్ తిరిగి జట్టులో చోటు దక్కించుకున్నారు.

## అట్టహాసంగా రింకూ, ప్రియ నిశ్చితార్థం



లక్నో: టీమ్‌ఇండియా యువ క్రికెటర్ రింకూసింగ్ తన బ్యాచిలర్ లైఫ్‌కు ఫుల్‌స్టాప్ పెట్టాడు. ఆదివారం సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ప్రియా సరోజ్‌ను రింకూసింగ్ నిశ్చితార్థం చేసుకున్నాడు. నగరంలోని ప్రముఖ హోటల్‌లో అట్టహాసంగా జరిగిన ఈ వేడుకకు రాజకీయ, క్రీడారంగ ప్రముఖులు హాజరయ్యారు. ఇరువురు కుటుంబసభ్యుల సమక్షంలో రింకూ, ప్రియ ఉంగరాలు మార్చుకున్నారు. ఈ కార్యక్రమానికి సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్‌యాదవ్, ఆయన భార్య డింపుల్, రాజీవ్‌శుక్లా, జయాబచ్చన్, శివపాల్‌యాదవ్, క్రికెటర్లు భువనేశ్వర్‌కుమార్, పీయూశ్‌చావ్లా హాజరయ్యారు. ఇటీవలే ముగిసిన ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు ఆడిన రింకూసింగ్..టీమ్‌ఇండియా టీ20 టీమ్‌లో కీలక క్రికెటర్‌గా కొనసాగుతున్నాడు. మరోవైపు మచిలీషహర్ స్థానం నుంచి ఎంపీగా గెలిచిన ప్రియ లోక్‌సభ ఎంపీగా వ్యవహరిస్తున్నది.

## ఖలీల్ విజృంభణ

### ఇంగ్లండ్ లయన్స్ తొలి ఇన్నింగ్స్ 327 ఆలౌట్




నార్తాంప్టన్(ఇంగ్లండ్): ఇంగ్లండ్ లయన్స్‌తో జరుగుతున్న రెండో అనధికారిక టెస్టు మ్యాచ్‌లో భారత్ 'ఏ' జట్టు పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తున్నది. ఓవర్‌నైట్ స్కోరు 192/3తో మూడో రోజు తొలి ఇన్నింగ్స్‌కు దిగిన ఇంగ్లండ్ లయన్స్..ఖలీల్ అహ్మద్(4/70) ధాటికి 327 పరుగులకు ఆలౌటైంది. పిచ్ పరిస్థితులను సద్వినియోగం చేసుకుంటూ ఖలీల్ పేస్ ధాటికి ఇంగ్లండ్ 10 పరుగుల తేడాతో నాలుగు కీలక వికెట్లు చేజార్చుకుంది. వికెట్‌కు ఇరువైపులా స్వింగ్ రాబట్టిన ఖలీల్..ఇంగ్లండ్ బ్యాటర్లను క్రీజులో కుదురుకోనివ్వలేదు. ఖలీల్ విజృంభణతో జోర్డాన్ కాక్స్(45), జేమ్స్ ర్యూ (10), జార్జ్ హిల్ (0), క్రిస్ వోక్స్(5) వెంటవెంటనే ఔటయ్యారు. అయితే ఆఖర్లో జోష్ టంగ్ (36 నాటౌట్), ఫర్హాన్ అహ్మద్ (24) రాణించడంతో ఇంగ్లండ్ 300ల మార్క్ అందుకుంది. అన్షుల్ కంబోజ్ (2/56), తుషార్‌దేశ్‌పాండే(2/62) రెండేసి వికెట్లు తీశారు. 21 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్‌కు దిగిన భారత్ 'ఏ' 18 ఓవర్లలో జైస్వాల్ (5) వికెట్ కోల్పోయి 75 పరుగులు చేసింది. రాహుల్ (37), కెప్టెన్ ఈశ్వరన్ (28) క్రీజులో ఉన్నారు. హిల్‌కు ఏకైక వికెట్ దక్కింది.



## శిఖర్‌సింగ్‌కు 16 లక్షలు

### సొంతం చేసుకున్న హైదరాబాద్ పీవీఎల్ నాలుగో సీజన్ వేలం

కాలికట్: కాలికట్ వేదికగా ఆదివారం ప్రైమ్ వాలీబాల్ లీగ్(పీవీఎల్) నాలుగో సీజన్ వేలంపాట ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. ప్లాటీనం కేటగిరీ నుంచి శిఖర్‌సింగ్‌ను రూ.16లక్షలకు హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ సొంతం చేసుకుంది. శిఖర్‌కు తోడు అమన్‌కుమార్, దీపు వేణుగోపాల్‌ను వరుసగా 11.5 లక్షలు, రూ.5.75 లక్షలకు దక్కించుకుంది. మిగతా ప్లేయర్ల విషయానికొస్తే జెరోమ్ వినీత్ అందరి దృష్టిని ఆకర్షించాడు. ప్లాటినం కేటగిరీ నుంచి అతన్ని చెన్నై బ్లిట్జ్ రూ.22.50 లక్షలకు తమ వశం చేసుకుంది. దీంతో లీగ్‌లో అత్యంత ఖరీదైన ప్లేయర్‌గా వినీత్ నిలిచాడు. స్థానిక ప్లేయర్ షమీముద్దీన్‌ను రూ.22.5 లక్షలకు కాలికట్ హీరోస్ తమ సొంతం చేసుకోగా, జిష్ణు పీవీని బెంగళూరు టార్పెడోస్ రూ.14 లక్షలకు తీసుకుంది.



Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, H.Nos. 9-87/3, 9-87/1, Adj to Jenvi Conventions, Tumkunta, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.